ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.40 (310.2522)	37,328	46,796
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.00 (3.93)	1644.31	427.68
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.96 (45.71)	26,850	33,650

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.186 | స్కిన్‌లెస్ : రూ.216



రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రాఖీ పర్వది నం కలిసి వచ్చింది. ప్రతీ పండుగకు మాదిరిగానే రాఖీకి సైతం ఆర్టీసీ గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు బస్సులను అధిక సంఖ్యలో నడిపించింది. దీంతో సంస్థకు ఆదాయం పెద్ద మొత్తంలో సమకూరింది. మూడు రోజుల్లో రూ.6.46కోట్ల ఆదాయం వచ్చింది. ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీలను, ఇతర సామగ్రి పంపే వెసులుబాటు కల్పించడంతో సంస్థకు మరింత ఆదాయం సమకూరింది.

- నల్లగొండ

ఆర్టీసీ ఆదాయం 3 రోజులు రూ.6.46కోట్లు

హైవేపై ప్రయాణించిన వాహనాల సంఖ్య 1.50లక్షలు

- ఆర్టీసీ ఆల్‌టైం రికార్డు
- కలిసొచ్చిన రక్షాబంధన్
- ఒక్క రోజే రూ.2.55కోట్ల ఆదాయం
- ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్న మహిళలు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పర్వదినం సందర్భంగా ప్రయాణ ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో నల్లగొండ రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 645 బస్సు సర్వీసులను అధికారులు నడిపించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో బస్సుల్లో ప్రయాణించారు. అదేవిధంగా పురుషుల ప్రయాణంతో ఆదాయం సమకూరింది. రీజియన్ పరిధిలోని ఏడు డిపోల పరిధిలో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపారు. అదేవిధంగా నాన్‌స్టాప్ బస్సులను సైతం రీజియన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలకు, ముఖ్య పట్టణాలకు నడపడంతో వల్ల ఆదాయం పెరిగింది. మహాలక్ష్మి పథకం కింద మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పల్లె వెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులను నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని బస్ స్టేషన్లలోనూ మూడు రోజులపాటు ప్రయాణికుల రద్దీతో బస్టాండ్లు కిటకిటలాడాయి. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం కావడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలకు బదులు ఆర్టీసీ బస్సుల్లోనే అధికంగా ప్రయాణించారని అధికారులు పేర్కొంటున్నారు.

రూ.6.46కోట్లకు పైగా ఆదాయం

రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో మొత్తం 645 బస్సు సర్వీసులు రాఖీ పండగ సందర్భంగా నడిచాయి. ఈ నెల 17న మొత్తం 2,98,951 మంది ప్రయాణించగా, అందులో మహాలక్ష్మి ప్రయాణికులు 1,84,346 మంది ఉన్నారు. మొత్తం ఆదాయం రూ.1,89,11,000 ఆదాయం వచ్చింది. 18న మొత్తం 3,04,372 మంది ప్రయాణించగా, అందులో మహిళా ప్రయాణికులు 1,85,771 మంది ఉండగా, రూ.2,02,49,000 ఆదాయం వచ్చింది. 19న 3,78,982మంది ప్రయాణించగా, మహాలక్ష్మి ప్రయాణికులు 2,52,506 మంది ఉండగా, రూ.2,55,03,000 ఆదాయం వచ్చింది. మూడు రోజుల్లో ఏడు డిపోల పరిధిలో 9,82,305 మంది ప్రయాణించగా, మహాలక్ష్మి కింద 6,22,623మంది మహిళలు ప్రయాణించగా, పురుష ప్రయాణికులు 3,59,682 మంది ఉన్నారు. మొత్తంగా ఏడు డిపోల పరిధిలో రూ.6,46,63,000 ఆదాయం సమకూరింది.

మూడు రోజుల్లో రీజియన్ పరిధిలో ఆదాయం ఇలా..

డిపో	17న	18న	19	మొత్తం
దేవరకొండ	51,345	54,411	68,457	1,74,213
కోదాడ	33,315	34,551	45,894	1,13,760
మిర్యాలగూడ	40,941	45,777	64,693	1,51,411
నల్లగొండ	50,969	51,180	63,191	1,65,340
నార్కట్‌పల్లి	9,315	9,838	11,188	30,341
సూర్యాపేట	64,638	61,099	73,979	1,99,716
యాదగిరిగుట్ట	43,408	46,519	51,580	1,41,507
మొత్తం	2,98,951	3,04,372	3,78,982	9,82,305
మహాలక్ష్మి ప్రయాణికులు	1,84,346	1,85,771	2,52,506	6,22,623
ఆదాయం	రూ.1,89,11,000	రూ.2,0249,000	రూ.2,55,03,000	రూ.6,46,63,000

దేవరకొండ డిపో మొదటి స్థానం

దేవరకొండ: రాఖీ సందర్భంగా ఈనెల 19న దేవరకొండ ఆర్టీసీ డిపో ఆదాయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజియన్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం దేవరకొండ డిపోలో ఉద్యోగులు, కార్మికులతో కలిసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీచేసి సంబరాలు నిర్వహించారు. రాఖీ రోజున దేవరకొండ డిపో రూ.46.78లక్షల ఆదాయం రాగా, 51,095కిలోమీటర్లు బస్సులు ప్రయాణించాయి. ఆదాయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజియన్‌లో ప్రథమ స్థానం, రాష్ట్రంలో ఐదో స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఉద్యోగులను దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు అభినందించారు.

8,23,976లక్షల కిలోమీటర్ల బస్సుల ప్రయాణం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు డిపోల పరిధిలో మొత్తం 645 బస్సులు 8,23,976 కిలోమీటర్లు ప్రయాణించాయి. 17న 2,61,112కిలోమీటర్లు, 18న 2,70,167కిలోమీటర్లు, 19న 2,92,697 కిలోమీటర్లు ప్రయాణించి మొత్తం 9,82,305 మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేశాయి. రక్షాబంధన్ సందర్భంగా ఆర్టీసీకి మూడు రోజుల్లో ఆల్ టైం రికార్డు ఆదాయం సమకూరిందని అధికారులు పేర్కొంటున్నారు. పండుగ సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు సెలవులు వినియోగించుకోకుండా ప్రయాణికులకు సేవలందించారు.

సంస్థకు అధిక ఆదాయం రావడం సంతోషం



రక్షాబంధన్ సందర్భంగా నల్లగొండ రీజియన్ పరిధిలో అత్యధిక ఆదాయం సమకూరడం సంతోషకరం. మహాలక్ష్మి కింద మహిళలు పెద్ద సంఖ్యలో ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. రికార్డుస్థాయిలో ఆదాయం రావడం ఉత్సాహపరిచింది. రానున్న రోజుల్లో ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పిస్తూ సంస్థను అగ్రభాగాన నిలబెడుతాం. ఉద్యోగులు అధికారులు, అందరి సహకారంతో సంస్థ లాభాల బాటలో నడుస్తోంది.

- రాజశేఖర్, ఆర్ఎం, నల్లగొండ రీజియన్

1.50లక్షలకు పైగా రాకపోకలు

హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్, చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 20: వరుస సెలవులతో హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసింది. ఆగస్టు 15వ తేదీనుంచి ప్రారంభమైన వాహనాల రద్దీ మంగళవారం వరకు కొనసాగింది. స్వాతంత్ర్య దినోత్సవం, శ్రావణ శుక్రవారం, శనివారం, ఆదివారం, రాఖీ పండుగలతో జాతీయరహదారి సందడిగా మారింది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ మీదుగా మూడు రోజుల్లో 1.50లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించాయి. సాధారణ రోజుల్లో 35వేలకు పైగా వాహనాల రాకపోకలు సాగిస్తుండగా సెలవుల నేపథ్యంలో శనివారం 48వేలు, ఆదివారం 51వేలు, సోమవారం 50వేల వాహనాలు రాకపోకలు సాగించినట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు తెలిపారు. ఇందులో కార్లు ఎక్కువగా ఉన్నాయి. ఇవిగాక బైక్‌లు, ఆటోలు, బస్సుల్లో ప్రజలు గ్రామాలకు వెళ్లారు. చౌటుప్పల్ పట్టణంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల రద్దీ కొనసాగింది. మూడు, నాలుగు వరసలుగా కార్లు నగరానికి పరుగులు తీస్తున్నాయి. పట్టణంలోని హైవేపైన ఉన్న మూడు జంక్షన్ల వద్ద కూడా వాహనాలను ట్రాఫిక్ పోలీసులు కొద్దిసేపు నిలిపి పంపిస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులతో బస్‌స్టేషన్ ప్రాంగణం రద్దీగా మారింది.



చౌటుప్పల్‌లో 65వ నెంబర్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

సాగర్, పులిచింతలలో కొనసాగుతున్న

విద్యుదుత్పత్తి

పూర్తిస్థాయికి రెండు అడుగుల దూరంలో 'మూసీ'



నాగార్జునసాగర్/కేతేపల్లి/మేళ్లచెర్వు, ఆగస్టు 20: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ వరద లేకపోవడంతో క్రస్ట్‌గేట్లను మూసివేసిన అధికారులు జల విద్యుదుత్పత్తిని మాత్రం కొనసాగిస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 589.40అడుగులు(310.2522టీఎంసీలు) ఉంది. ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885అడుగులు (215.8070టీఎంసీలు) కాగా శ్రీశైలానికి ఎగువ నుంచి 78,074 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం సాయంత్రానికి 881.70అడుగులుగా (197.4617టీఎంసీలు) ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,328 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ నుంచి మొత్తం 46,796 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువనుంచి 37,328 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

పూర్తిస్థాయికి రెండు అడుగుల దూరంలో 'మూసీ'

హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుండడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టులో నీటినిల్వ 645అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలోఉంది. రెండు రోజులుగా హైదరాబాద్,మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి 1644.31 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులు (4.46టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 643అడుగులకు (3.93టీఎంసీలు)చేరింది.మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి కాల్వకు 166.32క్యూసెక్కులు,ఎడమ కాల్వకు 261.36క్యూసెక్కుల నీటినివిడుదల చేస్తున్నారు.రైతుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని నీటి విడుదలను వారం రోజుల పాటు పొడిగించినట్లు మూసీ డ్యాం ఏఈఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. దీంతో ఈ నెల 26 వరకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల కొనసాగనుంది.

పులిచింతలలోనూ జలవిద్యుదుత్పత్తి

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. కేంద్రంలోని నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ, 105 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో ఎగువ నుంచి వచ్చిన వరద నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు (45.77 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 174.96 అడుగులుగా (45.71టీఎంసీలు)ఉంది. ఎగువ నుంచి 26,850 క్యూసెక్కులు వస్తుండగా ఒక్క రేడియల్ క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు ఎత్తి 17,650 క్యూసెక్కులను నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తంగా 33,650 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ •7లో..



రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార

సమాఖ్య చైర్మన్‌గా అమిత్ రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 20: తెలంగాణ రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల మండలం ఉరుమడ్లకు చెందిన అమిత్‌రెడ్డి అమెరికాలో బీటెక్, ఎంబీఏ అభ్యసించారు. గుత్తా వెంకటరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్రంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడిగా పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన ఆయన నల్లగొండ, భువనగిరి పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే బీఆర్ఎస్ అధిష్ఠానం టికెట్ కేటాయించకపోవడంతో పార్లమెంటు ఎన్నికల ముందు ఆయన తన అనుచరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చే రారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు. అనతి కా లంలోనే అమిత్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగనున్నారు.



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అమిత్ దంపతులు

రుణమాఫీ వర్తించని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

జేడీఏ శ్రవణ్‌కుమార్

నల్లగొండ, ఆగస్టు 20: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణ మాఫీ కాని రైతులు తమ మండల పరిధిలో ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జేడీఏ శ్రవణ్‌కుమార్ సూచించారు. అన్ని మండలాల వ్యవసాయ అధికారులు రైతులకు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మంగళవారం జేడీఏ కార్యాలయంలో నిర్వహించిన మండల వ్యవసాయాధికారుల సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రుణమాఫీ గురించి రైతులనుంచి పూర్తి వివరాలు, పాస్ పుస్తకాలు, ఇతర అగ్రిమెంట్లను తీసుకుని రుణమాఫీకి కావాల్సిన సమాచారం వారికి అందించాలని, ప్రతీ మండల అధికారి ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకూ మండల కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని, అధికారులు కూడా రైతుల ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

నల్లగొండ టౌన్, ఆగస్టు 20: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పానగల్ అర్బన్ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ సేవలు పొందుతున్న ప్రజలను వివరాలు అడిగి తెలుసుకోవడమే కాకుండా సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఫీవర్ సర్వే ద్వారా సీజనల్ వ్యాధులతో ఇబ్బందిపడే ప్రజలను గుర్తించి వారికి వైద్యసేవలందించాలన్నారు. డెంగీ ఫీవర్ కేసులు రాకుండా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటిని అరికట్టే విధానం గురించి తెలియజేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది అలెర్ట్‌గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీటీసీవో డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ రూపిక పాల్గొన్నారు.

పారిశుధ్యలోపం లేకుండా చూడాలి

- జ్వర సర్వే పూర్తిచేయాలి
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 20: వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి పారిశుధ్యలోపం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వారి పరిధిలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు, పడిపోయిన, ఒరిగిన, తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెచ్చులూడుతున్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులను ఉంచకుండా సురక్షిత గదులకు తరలించాలన్నారు. తాగునీటి కలుషితం కాకుండా, పైప్ లైన్ లీకేజీ కాకుండా చూడాలన్నారు. మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల, తాగునీటి సరఫరా శాఖ అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించి, కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. గురువారం నాటికి జ్వర సర్వే పూర్తిచేయాలన్నారు. వన మహోత్సవం కింద వారంలోపు ఆయా శాఖలకు ఇచ్చిన మొక్కల లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. హెచ్ఎండిఏ నుంచి పొడవైన మొక్కలు 1.60లక్షలు తెప్పిస్తున్నామన్నారు. నాటిన మొక్కలపై నెలాఖరున ఆడిట్ బృందాలతో ఆడిట్ నిర్వహిస్తామని, లెక్కల్లో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రుణమాఫీపై ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పరిష్కరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, డీపీవో మురళి, నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, పాల్గొన్నారు.



పామనగుండ్ల వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ట్రామాకేర్ సెంటర్‌కు స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

కట్టంగూరు: జాతీయ రహదారి వెంట ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కలెక్టర్ సి.నారయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. హైదరాబాద్- విజయవాడ రహదారిపై కట్టంగూరులోని పామనగుండ్ల సరిహద్దులో ప్రభుత్వం ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. మూడు రోజుల్లో గుర్తించిన స్థలాన్ని విభజించి హద్దులు ఏర్పాటు చేయాలని, ఆ స్థలంలో చెట్లు, చెత్తా చెదారం తీసివేసి చదును చేయించాలని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌ను ఆదేశించారు.

రాజీవ్‌గాంధీ సేవలు అజరామరం

డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, ఆగస్టు 20: రాజీవ్‌గాంధీ సేవలు అజరామరమని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌రోడ్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డిలతోపాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ దేశానికి సుస్థిర పాలన, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. దేశ ప్రజలకోసం రాజీవ్ గాంధీ ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకోసం పార్టీ శ్రేణులంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఐదురోజులపాటు అప్రమత్తంగా ఉండాలి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 20: రానున్న ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఖమ్మం నుంచి మంత్రి, హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల కలిగే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, స్థానిక పరిస్థితులను బట్టి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాల్లో పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత అధికారులతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నూతన రెవెన్యూ చట్టం ముసాయిదా, ధరణి దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్, తదితర అంశాలపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఆర్డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

చెర్వుగట్టు దేవస్థానంపై కలెక్టర్ నజర్!

● డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డికి పర్యవేక్షణ బాధ్యత

● ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ నిర్ణయం



నార్కట్‌పల్లి, ఆగస్టు 20: నల్లగొండ జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రమైన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రెండేళ్లుగా పాలక వర్గం లేక దేవాలయ నిర్వహణ గాడి తప్పిందన్న ఆరోపణలు, ఫిర్యాదులు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఇప్పటికే ఓ పర్యాయం దేవస్థానాన్ని సందర్శించిన కలెక్టర్ సంబంధిత శాఖా అధికారులు, సిబ్బందితో సమీక్ష కూడా నిర్వహించారు. దేవస్థానం నిర్వహణలో సమన్వయ లోపాలను గుర్తించి పారదర్శకత పెంపే కర్తవ్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శేఖర్‌రెడ్డికి ఆలయ పర్యవేక్షణ బాధ్యతను మూడు రోజుల కిందటే అప్పగించారు. దేవస్థానంలో దారి తప్పిన పాలనా వ్యవహారాలను గాడిలో పెట్టడం, భక్తుల సౌకర్యాలు తీర్చే అభివృద్ధి పనులకు మార్గదర్శనం చేయడం, ఆలయ ఆదాయానికి గండి పెడుతున్న కారణాలను గుర్తించి నష్టనివారణ చర్యలపై పీడీ దృష్టి సారించి తగు సూచనలు చేయనున్నారు. దీనికి తోడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో ఈనెలాఖరులో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధికి నిధుల వరాలు ప్రకటించే జాబితాలో చెర్వుగట్టు దేవస్థానం కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. మాస్టర్‌ప్లాన్‌తో దేవస్థానాన్ని అభివృద్ధి పర్చాలన్న మంత్రి కోమటిరెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంల ఆలోచనలకు అనుగుణంగా దేవస్థాన పాలనావ్యవహారాలు, సిబ్బంది పనితీరులో కొంత మార్పును తీసుకువచ్చే కారణంతోనే డీఆర్‌డీఏ పీడీకి పర్యవేక్షణ బాధ్యతలు అప్పజెప్పారంటున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఒకటి రెండు రోజుల్లో పీడీ దేవస్థానాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశం కానున్నట్లు సమాచారం.

గుట్టలో ఆంజనేయస్వామికి ఆకుపూజ



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 20 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.10,39,750లు జమఅయినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

దర్వేశీపురంలో సామూహిక కుంకుమపూజలు



ఆలయంలో సామూహిక కుంకుమపూజలు

కనగల్, ఆగస్టు 20 : నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశీపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయంలో సామూహిక కుంకు మార్చనలు నిర్వహించారు. శాంతికళ్యాణ పూజలు జరిపించారు. చీరసారె ఒడిబియ్యం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణబోనాలను సమర్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది తగు ఏర్పాట్లుచేశారు.



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

యాదాద్రి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎగువన వర్షాలతో మూసీ నదీ పరవళ్లు తొక్కుతోంది. యాదాద్రిభువనగిరి జిల్లాలో సోమవారం సగటున 46.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌తో పాటు జంట నగరాలతో కురుస్తున్న భారీ వర్షాలతో మూసీకి భారీగా వరద నీరు వస్తోంది. దీనికి తోడు జిల్లాలో వర్షాలు వరదకు తోడై నదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసీ ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మూసీ పరివాహక ప్రాంతాలపై సంబంధిత అధికారులు ఎప్పకటిప్పుడు పర్యవేక్షించాలని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ కే జెండగే ఆదేశించారు.




భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు-రుద్రవెల్లి గ్రామాల మధ్య వంతెనపై ప్రవహిస్తున్న మూసీ వరద నీరు, వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన బ్యారీకేడ్లు

తగ్గుముఖం పట్టిన వరద

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉధృతంగా ప్రవహించిన మూసీ రాత్రికి తగ్గుముఖం పట్టింది. దీంతో సంగెం వద్ద రాత్రి వేళలో వాహనాల రాకపోకలు నడిచాయి. అయితే హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సంగెం, రుద్రవెల్లి బ్రిడ్జిల వద్ద ఎప్పకటిప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

జోరుగా వర్షాలు

జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సగటున 46.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా యాదగిరిగుట్ట మండలంలో 170.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా రామన్నపేట మండలంలో 5.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా భువనగిరిలో 132.3 మిల్లీమీటర్లు, బొమ్మలరామారంలో 98.8, మోటకొండూరులో 95.5, యాదగిరిగుట్టలో 68.6, ఆలేరులో 68.5, తుర్కపల్లి మండలంలో 50.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా వర్షపాతం నమోదైంది.



రుద్రవెల్లి, జూలూరు లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మూసీ

ఆరుతడి పంటలకు...

భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ఆనందం నెలకొంది. ప్రస్తుత వర్షాలతో ఆరుతడి పంటలకు జీవంవచ్చింది. మరో నాలుగైదు రోజుల పాటు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగి వరి పంటకు ఇబ్బందికరంగా ఉండదని రైతులు ఆశిస్తున్నారు.

నిలిచిన రాకపోకలు

బీబీనగర్ : బీబీనగర్ మండలంలో మూసీ పరవళ్లు తొక్కింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే ప్రవాహం మెల్లమెల్లగా పెరుగుతూ ఉదయానికల్లా ఉగ్రరూపం దాల్చింది. దీంతో బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి ప్రధానమార్గంలో రుద్రవెల్లి, జూలూరు గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ ప్రవహించింది. దాంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నిత్యం ఈ మార్గం గుండా రాకపోకలు కొనసాగించే వారంతా పిలాయిపల్లి, మక్తనంతారం, బట్టుగూడెం, పెద్దరావులపల్లి మార్గాల ద్వారా రాకపోకలు కొనసాగించారు. ఈ మార్గంలో నడపాల్సిన యాదగిరిగుట్ట, ఉప్పల్ డిపో బస్సులను పోచంపల్లి వరకు కాకుండా రుద్రవెల్లి వరకు ఆర్టీసీ అధికారులు కుదించి నడిపించారు. మరో నాలుగైదు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు రుద్రవెల్లి, జూలూరు మార్గంపై నిఘా ఏర్పాటుచేశారు. మూసీకి పోటెత్తిన వరద ఉధృతితో మరికొన్ని రోజుల పాటు ఈ ప్రాంత ప్రజలకు తిప్పలు తప్పేలాలేవు.

చెరువులకు జలకళ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని మూసీ ఆయకట్టులోని గ్రామాల్లోని చెరువులు మూసీ వరద నీటితో నిండి జలకళ సంతరించుకున్నాయి. అదేవిధంగా జూలూరు-రుద్రవెల్లి గ్రామాల మధ్య వంతెనపై మూసీ వరద పరిస్థితిని మంగళవారం తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. రహదారిపై రాకపోకలు నిలిపివేస్తూ బారికేడ్లు అడ్డుగా పెట్టారు. వారి వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుత్తా వెంకట్‌రెడ్డి ఉన్నారు.మంగళవారం ఉదయం వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై వరద నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వలిగొండ మండలంలో

వలిగొండ : మండలంలోని సంగెం గ్రామం భీమలింగం కత్వ వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మంగళవారం ఉదయం అధికారులు బారీగేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. సంగెం, చౌటుప్పల్, పోచంపల్లి మండలాలకు చెందిన ప్రజలు భువనగిరికి వెళ్లడానికి వలిగొండ మీదుగా వెళ్లారు. సాయంత్రం వరద నీరు తగ్గడంతో సంగెం వంతెనపై నుంచి రాకపోకలను అధికారులు అనుమతించారు. మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీరు నిలిచి గుంతలు పడ్డాయి. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

జిల్లాలో కురిసిన వర్షం

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూర్(ఎస్)లో 59.0 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. అత్యల్పంగా తిరుమలగిరిలో 4.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 22.2 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు ఆవులు మృతి

నూతనకల్: పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో సోమవారం రాత్రి జరిగింది. మాచనపల్లి ఆవాసం గుగులోతుతండాకు చెందిన రైతు గుగులోతు రాములు తన రెండుఆవులను వ్యవసాయ బావి వద్ద సోమవారం రాత్రి కట్టేశాడు. రాత్రి ఆవులను కట్టి ఉంచిన చెట్టుపై పిడుగుపడడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఆవుల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని రైతు తెలిపారు.

మూసీ ఆయకట్టుకు నీటి విడుదల వారం పెంపు

కేతేపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి విడుదలను అధికారులు వారం రోజుల పాటు పొడిగించారు. వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు నాలుగు విడతలుగా సాగునీటిని అందించేలా అధికారులు రూపొందించి ఆ మేరకు జూలై 25 నుంచి ఈ నెల 19 వరకు మొదటి విడతగా 25 రోజుల పాటు నీటి విడుదల జరగాల్సి ఉంది. ఆయకట్టులో రైతులు సాగు చేసిన వరి పంట ప్రస్తుతం పిలక దశలో ఉండడంతో పాటు ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పంటకు నీటి అవసరం పెరిగింది. ఈ క్రమంలో ఆయకట్టుకు మొదటి విడత నీటి విడుదలను వారం రోజులు పొడిగించాల్సిందిగా ఆయకట్టు రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించారు. రైతుల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న అధికారులు నీటి విడుదలను వారం రోజుల పాటు పొడిగించినట్లు మూసీ డ్యాం ఏఈఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. దీంతో ఈ నెల 26 వరకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల కొనసాగనుంది.

మైలసముద్రానికి వరదనీరు



కనగల్: ఎగువన కురిసిన వర్షాలతో నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని మైలసముద్రానికి మంగళవారం వరద నీరు వచ్చి చేరింది. వాయిలేటివంపు, పర్వతగిరి కల్లెడ కాల్వ ద్వారా వర్షపు నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఇటీవల మాజీ జడ్పీటీసీ నర్సింగ్‌శ్రీనివాస్‌గౌడ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో కల్లెడకాల్వలకు మరమ్మతులు పనులు చేపట్టి పూర్తిచేశారు. దీంతో ప్రస్తుతం ఎగువన కురిసిన వర్షాలకు కూడా వరదనీరు నేరుగా చెరువుకు వచ్చిచేరుతోంది. ఈ ఏడాది తీవ్రవర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువు పూర్తిగా ఎండిపోయింది. చెరువు కింద 2వేల ఎకరాల ఆయకట్టు భూములు ఖరీఫ్ సాగుకు నోచుకోక బీళ్లుగా ఉండేవి. అయితే చెరువుకు వస్తున్న వరదనీటితో ఆయకట్టు రైతులకు కొత్తఆశలు చిగురుస్తున్నవి. కాగా ఏఎమ్మార్పీ ద్వారా సాగర్ నీటిని చెరువుకు విడుదల చేసి పూర్తిస్థాయిలో నింపాలని రైతులు కోరుతున్నారు.

అత్యాశకు పోయి కటకటాలపాలయ్యాడు

● బెడిసికొట్టిన లారీ ఓనర్ పథకం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 20: ఫైనాన్స్ సంస్థ నుంచి తీసుకున్న అప్పు కిస్తీ రద్దు, రూ.10లక్షల విలువైన స్ర్కాప్ లోడ్ సొంతం చేసుకునేందుకు ఓ లారీ ఓనర్ వేసిన పథకం బెడిసికొట్టింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు మంగళవారం వెల్లడించారు. మాడ్గులపల్లి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన బందారపు నాగార్జున లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఐదేళ్ల కిందట ఇండోస్టార్ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.13లక్షల రుణం పొంది 12 టైర్ల లారీని కొనుగోలు చేశాడు. అదే లారీకి డ్రైవర్‌గా చేస్తూ కిరాయిలకు లారీని తిప్పుకుంటూ ప్రతినెలా రూ.54వేల కిస్తీ రూపంలో చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకున్నాడు. అయితే ఈ ఏడాది మే నెల నుంచి నెలసరి కిస్తీలు ఫైనాన్స్ సంస్థకు చెల్లించకుండా ఎగ్గొట్టేందుకు పన్నాగం పన్నాడు. లారీని దొంగలు ఎత్తుకెళ్లినట్టు నమ్మించేందుకు ప్రయత్నించాడు. అందులో భాగంగా పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు రిజిస్టర్ చేయిస్తే లారీపై ఉన్న ఫైనాన్స్ మొత్తం రద్దవుతుందని ఆలోచించాడు.

మూడు నెలలోగా బత్తాయి తోటలో లోడ్ లారీ

ఈ క్రమంలో మే 22న విశాఖపట్నం నుంచి ఐరన్‌స్ర్కాప్ లోడ్‌తో బందారపు నాగార్జున మహారాష్ట్రకు లారీతో బయలుదేరాడు. మిర్యాలగూడలో తాను నివాసం ఉంటున్న దుర్గానగర్‌కు చేరుకుని తన పథకాన్ని అమలు చేసేందుకు ప్రయత్నించాడు. అందులో భాగంగా రెండు రోజుల పాటు తన నివాసానికి సమీపంలోని ఖాళీస్థలంలో లారీని నిలిపాడు. అనంతరం కనగల్ మండలం చిన్నమాదారం గ్రామానికి చెందిన తన అల్లుడు బొడ్డుపల్లి అనిల్‌కు చెందిన బత్తాయితోటలోని చెట్లపొదళ్ల మధ్య మే 25న లారీని దాచిపెట్టి నెంబర్ ప్లేట్ తీసేసి, ఛాసిస్, ఇంజన్ నెంబర్లు కనిపించకుండా పసుపురంగు పూసాడు. లారీని ఇక్కడ ఉంచడంతో తనకు సమస్య వస్తుందని అనిల్ చెప్పినప్పటికీ కొద్దిరోజుల్లోనే లారీని తీసుకెళ్తానని బతిమాలుకొని తోటలో ఉంచి వెళ్లాడు. లారీచోరీకి గురైనట్లు ఎఫ్ఐఆర్ నమోదైతే ఫైనాన్స్ రద్దు కావడంతో పాటు మహారాష్ట్రలోని జేకేస్టీల్ కంపెనీకి డెలివరీ ఇవ్వాల్సిన రూ.10లక్షల విలువైన ఐరన్ స్ర్కాప్‌తో పాటు లారీ మిగిలిపోతుందన్న ఆత్యాశతో తన పథకం అమలుకు ప్రయత్నించాడు. తన లారీ చోరీకి గురైనట్లు మే 26న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. దీనిపై అనుమానం కలిగిన పోలీసులు తమదైన శైలిలో విచారణ మొదలుపెట్టారు. ఈ సందర్భంలో గత కొద్దిరోజులుగా చిన్నమాదారం గ్రామంలోని అనిల్ అనే వ్యక్తికి చెందిన బత్తాయి తోటలో లారీ ఉన్నట్లుగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ నరేష్‌తో కలిసి మంగళవారం తోటకు వెళ్లి లారీని పరిశీలించారు. సదరు లారీ ఇంజన్, ఛాసిస్ నెంబర్ ఆధారంగా ఇండోస్టార్ ఫైనాన్స్ సంస్థ ఆర్థికసాయంతో నాగార్జున కొనుగోలు చేసిన టీఎస్05యూసీ 5577 నెంబర్ గల వాహనంగా గుర్తించినట్లు సీఐ తెలిపారు.ఫైనాన్స్‌సంస్థను, పోలీసులను పక్కదారి పట్టించేలా వ్యవహరించిన లారీ ఓనర్ నాగార్జునపై కేసు నమోదు చేసి, నిందితుడి నుంచి అశోక్‌లేలాండ్ కంపెనీకి చెందిన 12 టైర్ లారీ,రూ.12లక్షల విలువైన జేకేస్టీల్ కంపెనీకి చెందిన ఐరన్‌స్ర్కాప్, లారీపత్రాలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.కేసును ఛేదించిన సీఐ,ఎస్ఐలతో పాటు ఏఎస్ఐ గఫార్, రాములునాయక్‌ను డీఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న లారీతో సీఐ వీరబాబు, ఎస్ఐ నరేష్

హత్య కేసులో నిందితుల అరెస్టు

నేరేడుచర్ల, ఆగస్టు 20 : హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన మహ్మద్‌షేక్ మీరా, మహ్మద్ షేక్ జాన్, మహ్మద్‌షేక్ ఆశాబీ ముగ్గురు కలిసి పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 15వ తేదీ సాయంత్రం కర్రలు, ఇనుప రాడ్డుతో బక్కయ్యగూడెం గ్రామంలో జరిగిన ఘర్షణలో మహ్మద్‌షేక్ జాని(47)పై దాడి చేశారు. అనంతరం జాని భార్య నన్నీబీ గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకు వెళ్లి చూపించింది. రాత్రి ఇంటి వద్దనే ఉన్న జాని ఈ నెల 16వ తేదీన సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఈ నెల 17న హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి ఆసుపత్రి వైద్యులు సమాచారం ఇవ్వడంతో భార్య నన్నీబీ ఈ నెల 18 ఉదయం నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. 18 సాయంత్రం జాని మృతి చెందాడు. భార్య నన్నీబీ ఫిర్యాదు మేరకు హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కేసు నమోదు చేసుకొని హుజూర్‌నగర్ సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. నిందితులను మంగళవారం పట్టుకొని సాయంత్రం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థినిని వేధించిన ఆకతాయి అరెస్టు

నర్సింహులపేట, ఆగస్టు 20 : పాలిటెక్నిక్ విద్యార్థినిని ప్రేమపేరుతో వేధించి, ఆమె బలవన్మరణానికి కారణమైన ఆకతాయిని పోలీసులు అరెస్టు చేసి, మంగళవారం తొర్రూరు కోర్టులో హాజరుపరిచారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డీఎస్పీ సురేష్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని(17) సూర్యాపేట జిల్లా కోదాడలో పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతోంది. ఖమ్మం జిల్లాలోని వైరాకు చెందిన 17ఏళ్ల ఆకతాయి(మైనర్) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ విద్యార్థిని ఈనెల 15న ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందును తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 16న నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, భరోసా సెంటర్‌కు అనుసంధానం చేశారు. మహబూబాబాద్ ఉమెన్ ఎస్ఐ పోక్సో చట్టం ప్రకారం ఆసుపత్రిలో చికిత్స పొందున్న బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించి ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) సెక్షన్లను జోడించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 17వ తేదీన మహబూబాబాద్ జిల్లా మెజిస్ట్రేట్ కూడా మరణ వాంగ్మూలం తీసుకున్నారని, ఆ మరుసటి రోజైన 18న ఆమె చికిత్స పొందుతూ మృతి చెందినట్టు డీఎస్పీ సురేష్ వివరించారు. బాధితురాలు మరణ వాంగ్మూలం ప్రకారం దర్యాప్తు చేసి మంగళవారం ఉదయం తొర్రూరు బస్టాండ్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకొని క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని, కేసు దర్యాప్తులో ఉన్నట్లు తెలిపారు. జిల్లా పోలీస్ అధికారి సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ జగదీష్ ఉన్నారు.

మిస్టరీగా క్యాష్‌డిపాజిటర్ మృతి

● హత్యా..ఆత్మహత్యా..?

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 20 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో ఏటీఎం క్యాష్‌డిపాజిటర్ మృతి మిస్టరీగా మారింది. తోడు ఉంటేనే వెళ్లడం ఇబ్బందికరంగా ఉన్న సాగర్ సమీపంలోని దట్టమైన కిలోమీటర్ అటవీ ప్రాంతంలోకి ఎలా వెళ్లాడా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. తోడుగా ఎవరైనా వెళ్లారా? ఆత్మహత్య చేసుకున్న ప్రదేశానికి పాతిక అడుగుల దూరంలో కనిపించే బీరు బాటిళ్లు, బిర్యానీ ప్యాకెట్లు ఎవరు తెచ్చారు? ఎంతమంది కలిసి తాగి, తిన్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. నెల్లికల్ ఫారెస్ట్ బీట్‌లోని వినాయక దేవాలయం వెనుక సోమవారం పశువుల కాపారి సమాచారంతో పోలీసులకు లభ్యమైన మృతదేహం సుమారు వారం రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిదిగా నిర్ధారించారు. అతడి జేబులో లభ్యమైన కార్డు ఆధారంగా ఇటాచీక్యాష్ మేనేజ్‌మెంటు సంస్థలో పనిచేసే క్యాష్ డిపాజిటర్ పగడాల సుధాకర్‌గా పోలీసులు నిర్ధారించారు. అప్పటికే అతడిపై మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటికే ఫిర్యాదు ఉండటంతో గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. అయితే సుధాకర్ మృతిపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది హత్యా?, ఆత్మహత్యా అనే సందిగ్ధం నెలకొంది.

సుధాకర్ ఉరివేసుకున్న చెట్టును చూతో ఎలా ఎక్కాడన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చెట్టు చివరికి ఎక్కి అక్కడ తాడు బిగించుకుని దూకి చావడం అసాధ్యమంటున్నారు. అంత ఎత్తు నుంచి ఆ వేగానికి కొమ్మ విరిగిపడి ఉండేదని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో కొందరి పాత్ర ఖచ్చితంగా ఉంటుందన్న సందేహాన్ని వ్యక్తం చేస్తుందన్నారు. పక్కాప్లాన్ ప్రకారమే ఈ సంఘటనను చిత్రీకరించారన్న సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి.



సుధాకర్(ఫైల్)

పోలీసుల విచారణపై సందేహాలు

సుధాకర్ కనిపించకపోవడంపై ఫిర్యాదు వారం కిందటే ఫిర్యాదు అందింది. అయితే భార్యను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పూచికత్తుపై వదిలేస్తూ కాలం వెళ్లబుచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. అతడి మృతదేహం లభ్యమయ్యే వరకూ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా సెల్‌ఫోన్ ఆ మేరకు వినియోగించలేదన్న విమర్శలు ఉన్నాయి. డిపాజిట్‌క్యాష్ కాజేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సుధాకర్ సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీపర్చుకున్నారు. ఆ సెల్‌ఫోన్‌ను కాల్‌డేటాతో పాటు ఇతర ఆన్‌లైన్ యాప్‌ల వాడకాన్ని పరిశీలిస్తే ఈ కేసులో కొంత పురోగతి లభిస్తుందన్న ఆశాభావాన్ని ప్రతి ఒక్కరూ వ్యక్తం చేస్తున్నారు.

రూ. 20లక్షల నగదు ఏమైనట్టు?

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన పగడాల సుధాకర్(38) కొన్నేళ్లుగా ఇటాచీక్యాష్ మేనేజ్‌మెంట్ సంస్థలో ఏటీఎం క్యాష్ డిపాజిటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే బ్యాంకులకు అనుసంధానంగా పనిచేసే ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ చేసేసందర్భంలో సదరు బ్యాంక్ అకౌంటెంట్ పర్యవేక్షణలో క్యాష్ ఆఫీసర్, సెక్యూరిటీగార్డ్ నిఘాలో డిపాజిటర్లు క్యాస్‌డిపాజిట్ చేస్తుంటారు. బ్యాంకులకు దూరంగా పనిచేసే ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ చేసేందుకు సెక్యూరిటీగార్డు, ఇద్దరు క్యాష్ డిపాజిటర్లు వెళ్తుంటారు. అయితే ఈ నెల 13న క్యాష్‌డిపాజిట్ చేసేందుకు సుధాకర్‌తో కలిసి వెళ్లింది ఎంతమంది.. ఆ రోజు మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, హాలియా రూట్లో క్యాస్ డిపాజిట్ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. అయితే ఏరూట్లో వెళ్తుండగా డిపాడిజిట్ క్యాష్‌తో ఉడాయించాడన్నది మాత్రం తెలియరావడం లేదు. సుధాకర్ క్యాష్‌బిండళ్లతో పారిపోతుంటే అతడితో పాటున్న వ్యక్తులు వెంబడించారా, వదిలేశారా? ఆ తరువాత ఏం జరిగింది.. నిందితుడు కాజేసిన డబ్బు ఏమైంది. ఎవరిచేతికి చిక్కిందన్నది మిస్టరీగా మారింది. డబ్బుతో సుధాకర్ అజ్ఞాతంలోకి వెళ్లి తలదాచుకున్నాడని భావించిన పోలీసులకు అతడి మృతదేహం సాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో లభ్యం కావడంతో కేసు స్వరూపం మలుపుతిరిగింది. ఎన్నో సందేహాలతో కూడిన కేసు మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు అన్నికోణాల్లో సమగ్రవిచారణ చేపట్టాల్సిన అవసరత ఏర్పడింది.

నేడు స్వగ్రామానికి త్రిపుర రాష్ట్ర గవర్నర్

● సూర్యాపేట జిల్లా గానుగుబండలో ఏర్పాట్లు ● తుంగతుర్తిలో ఆత్మీయ సమావేశం

తుంగతుర్తి, ఆగస్టు 20: త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి తన స్వగ్రామం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామానికి బుధవారం రానున్నారు. గవర్నర్‌గా నియమితులైన అనంతరం తొలిసారిగా తాను పుట్టి పెరిగిన గ్రామాన్ని సందర్శించేందుకు వస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు తుంగతుర్తికి చేరుకుంటారు. మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఆత్మీయ సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తన స్వగ్రామం గానుగుబండకు వెళ్లి అక్కడ దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం గ్రామస్తులు, బంధువులను కలువనున్నారు. ఆయన రాకను స్వాగతిస్తూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సిరి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటయ్యే సమావేశానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డితో పాటు పలువురు హాజరుకానున్నారు.

కొలనుపాకలో పంచతంత్ర కథల శిల్పాలు

● చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

ఆలేరు రూరల్, ఆగస్టు 20: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో పంచతంత్రం కథల శిల్పాలను గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. కొలనుపాకలోని సోమేశ్వరాలయం ముందున్న మ్యూజియం ఎడమవైపు ప్రాంగణంలోని ప్రహరీ గోడపై పంచతంత్రం కథల శిల్పాలను గుర్తించామన్నారు. 9 లేదా 10వ శతాబ్దంలో రాష్ట్రకూటుల కాలంలో నిర్మితమైన కొలనుపాక ఆలయంలో ఈ శిల్పాలు లభించడం చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్రకూటుల కాలంలో నిర్మించిన ఈ దేవాలయాన్ని ధ్వంసం చేయగా పునర్నిర్మాణం చేశారన్నారు. సాధారణ రాళ్లతో కలిపి శిల్పాల వరుసను ఒక వరుసలో నిలిపారని అందులో మూడు పంచతంత్రం కథల శిల్పాలు ఉన్నాయన్నారు. ఈ శిల్పాలన్నింటిని అరపేట ఎత్తు కలిగిన రాతిలోపల చెక్కి ఉండటం, గోడకు ఐదు అడుగుల ఎత్తులో ఉండడంతో పిల్లలకు కనిపించకుండా ఉన్నాయన్నారు. ఈ శిల్పాల వరుసలో లజ్జగౌరీ 24వ తీర్థాంకరుడైన వర్ధమాన మహావీరుడు శిల్పాలు ఉన్నాయన్నారు.



సింహం కుందేలు కథను తెలియజేసే శిల్పం, చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

అవినీతి ఆరోపణలతో సీఐపై చర్యలు

మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ సుధాకర్ ఐజీ ఆఫీసుకు అటాచ్

నల్లగొండ క్రైం, ఆగస్టు 20 : అవినీతి ఆరోపణలు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ సుధాకర్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా ఆరు నెలల కిందట బాధ్యతలు చేపట్టిన సీఐ సుధాకర్ అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడంతో పాటు భూవివాదాల్లో జోక్యం చేసుకుని భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఆరోపణలపై విచారణ చేయాలని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీఐ సుధాకర్‌పై విచారణ చేపట్టిన ఎస్పీ శరత్ చంద్ర పవార్ అక్రమ వసూళ్లు, భూవివాదాల్లో సుధాకర్ తల దూర్చినట్లు నిర్ధారణ కావడంతో ఐజీ ఆదేశాల మేరకు సీఐ సుధాకర్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా అక్రమ వసూళ్లు, ఇతర కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు.



సీఐ సుధాకర్

గల్లంతైన బాలిక మృతదేహం లభ్యం


వేములపల్లి, ఆగస్టు 20 : సాగర్ ఎడమకాల్వలో సోమవారం ప్రమాదవశాత్తు గల్లంతైన బాలిక పోతురాజు తేజశ్రీ(14) మృతి చెందింది. బాలిక మృతదేహం నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామశివారులోని బ్రిడ్జి వద్ద లభ్యమైనట్లు ఎస్ఐ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కుసుమవారిగూడెం గ్రామానికి చెందిన పోతురాజు విజయలక్ష్మి తన తమ్ముడు కోదాడి పరశురాములు వివాహానికి భర్త సైదులు, కుమార్తె తేజశ్రీ (14), కుమారుడు గోపిచంద్‌తో కలిసి ఆరు రోజుల క్రితం వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామానికి వచ్చారు. ఆదివారం వివాహం పూర్తవడంతో సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వపై ఎల్-14 వద్ద గల ర్యాంపు వద్ద దుస్తులు ఉతికేందుకు వచ్చారు. విజయలక్ష్మి తన కుమార్తె తేజస్వి, కుమారుడు గోపిచంద్‌లతో పాటు ఆమె చెల్లెలు ముడుసు రోహిణి, అక్క రొయ్య ఎల్లమ్మ, ఎల్లమ్మ కుమారుడు రొయ్య ప్రదీప్‌లతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో కాల్వలో స్నానం చేస్తుండగా తేజస్వి కాలు జారి కాల్వ నీటిలో పడింది. వరద ప్రవాహానికి కొట్టుకుపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించినా గల్లంతైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు వేములపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాల్వపై గస్తీ నిర్వహిస్తుండగా మంగళవారం మధ్యాహ్నం సమయంలో శెట్టిపాలెం గ్రామశివారులోని బ్రిడ్జి వద్ద సాగర్ ఎడమకాల్వలో మృతదేహం తేలాడుతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



ఎడమకాల్వలో లభ్యమైన తేజశ్రీ మృతదేహం

యువకుడి బలవన్మరణం

గుర్రంపోడు, ఆగస్టు 20 : ఉరివేసుకుని యువకుడు బలవన్మరణం చెందాడు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం ఆమలూరు గ్రామంలో జరిగింది. ఎస్ఐ బీ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేకల అంజయ్య, రాములమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు ప్రవీణ్(30) మేఘా కంపెనీలో పైపుల ఏర్పాటు పనుల్లో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగా ప్రవీణ్ ఇంట్లో ఉరేసున్నాడు. సాయంత్రం పనులు ముగించుకుని వచ్చిన కుటుంబ సభ్యులు గమనించేసరికి మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు కాగా ఆయన తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ప్రవీణ్ మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. కాగా ప్రవీణ్ మృతికి కారణాలు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు. కాగా మంగళవారం గ్రామంలో నిర్వహించిన ప్రవీణ్ అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి పాల్గొన్నారు. మృతుడు అవివాహితుడు కాగా వ్యవసాయంతో పాటు చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుని తండ్రి మేకల అంజయ్య పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాడు. మృతదేహం పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మేకల ప్రవీణ్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బీబీనగర్, ఆగస్టు 20 : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్ మండలం రహింఖాన్‌గూడెం గ్రామానికి చెందిన ధరావత్ సాయికిరణ్(19) బీబీనగర్‌కు పని మీద వచ్చి తిరిగి బైకుపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో భారత్ గ్యాస్ గోదాం సమీపం వద్ద బ్రాహ్మణపల్లి వైపు నుంచి ఎదురుగా బైకుపై వస్తున్న మరో వ్యక్తి వేగంగా ఢీకొట్టడంతో సాయికిరణ్ తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించేటప్పటికి మృతి చెందాడు. సాయికిరణ్ తండ్రి ప్రభాకర్‌నాయక్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

నూతన్‌కల్, ఆగస్టు 20 : అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలకేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా జరిగింది. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల భూపాలపల్లి జిల్లా నుంచి బొగ్గు లోడుతో మేళ్లచెర్వుకు వెళ్తున్న లారీ మండలకేంద్రం శివారులోని మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లను ఢీకొని బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మోహన్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌కో నూతన ఎస్ఈగా పాల్‌రాజ్

నల్లగొండ టౌన్, ఆగస్టు 20 : ట్రాన్స్‌కో నల్లగొండ జిల్లా ఎస్ఈ చంద్రమోహన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్ఈగా సూర్యాపేట జిల్లా ఎస్ఈగా పనిచేస్తున్న సీహెచ్ పాల్‌రాజ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన చంద్రమోహన్ సిద్ధిపేట జిల్లాకు స్థానచలనం కల్పించారు. ఆయన జిల్లాలో మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. నూతన ఎస్ఈగా నియమితులైన పాల్‌రాజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ శాఖకు చెందిన వివిధ సంఘాల నాయకులు, అధికారులు నూతన ఎస్ఈకి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే వీరేశం



నకిరేకల్‌లో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, ఆగస్టు 20: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 214మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.72లక్షల విలువైన చెక్కులను మంగళవారం నకిరేకల్ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకున్నారు. కార్యక్రమంలో చిట్యాల మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్నవెంకట్‌రెడ్డి, నకిరేకల్ పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నకిరేకల్, కట్టంగూరు, చిట్యాల కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు నకిరేకంటి యేసుపాదం, పెద్ది సుక్కయ్య, గుడిపాటి లక్ష్మీనర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

'గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి'

శాలిగౌరారం, ఆగస్టు 20: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ సూర్య శిల్ప కోరారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో గర్భిణులకు మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కట్టంగూరు మండలం చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన కక్కిరేణి నవీన్-జ్యోతి దంపతులు మాదారం, చిత్తలూరు, ఇటుకులపహాడ్ గ్రామాల గర్భిణులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, అధ్యక్షులు డెంకల సత్యనారాయణ, ప్రతినిధులు దునక వెంకన్న, మురారిశెట్టి కరుణాకర్, పీహెచ్ఎన్ రాములమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు మరియా, దయామణి, ఏఎన్ఎంలు మహేశ్వరీ, శోభ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ చొరవతోనే బదిలీలు, పదోన్నతులు



సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న పీఆర్టీయూటీఎస్ నాయకులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 20: పీఆర్‌టీయూ టీఎస్ చొరవతోనే ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేసిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులతో మంగళవారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదుర్కుంటున్న పలు సర్వీస్ సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. అపరిష్కృతంగా ఉన్న డీఏ చెల్లింపు, సీపీఎస్ రద్దు, తదితర సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐక్య గురుకులాల కన్వీనర్ గాదె లింగస్వామి, ప్రధాన కార్యదర్శి కొనిదల శంకర్, నాయకులు కందిమల్ల కృష్ణారెడ్డి, డీ. యాదగిరి, కళింగచారి, ఆదిమల్ల మణిరాజు, కరీం, ఇరిగి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలి



పెద్దవూరలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమాదేవి

నాగార్జునసాగర్, ఆగస్టు 20: గ్రామాల్లోని వీధుల్లో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని పెద్దవూర ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మురుగు కాల్వలను వెంటనే శుభ్రం చేయించాలన్నారు. అవసరమైతే తాత్కలిక సిబ్బందిని నియమించుకోవాలన్నారు. గ్రామాల్లో కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలు, పాత ఇళ్లను గుర్తించి వాటిలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పాత విద్యుత్ స్తంభాల వద్దకు ప్రజలు వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బి. శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగి సమావేశంలో మాట్లాడారు. ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా ఉండాలన్నారు. గ్రామాల్లో శిథిలమై ప్రమాదకరంగా ఇళ్లు, భవనాలను తొలగించాలని సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తగిన ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఫీవర్ సర్వే సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీవో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ.. సాంకేతిక విప్లవానికి నాంది



మిర్యాలగూడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, శంకర్‌నాయక్



చండూరులో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



హాలియాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 20: దేశానికి తొలిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన ప్రదాత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా రాజీవ్‌చౌక్‌లోని విగ్రహానికి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ ఫ్లెక్సీకి డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో కలిసి నివాళులర్పించారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని గుర్తించి నూతన టెక్నాలజీతో వారి శక్తి సామర్థ్యాలను ఇనుమడింపజేసి దేశాన్ని ఆర్థిక పురోభివృద్ధివైపు నడిపించిన గొప్ప పరిపాలనాధకుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్ నాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, ఐఎన్‌టీయూసీ నాయకులు అంబటి సోమయ్య, తలకొప్పుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

హాలియా: సాంకేతిక రంగాన్ని అభివృద్ధి పరిచింది రాజీవ్‌గాంధీ అని అనుముల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. హాలియా మున్సిపాలిటీలో అనుముల మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతి చిన్న వయస్సుల్లోనే రాజీవ్‌గాంధీ ప్రధాని అయ్యారని, యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, తక్కెళ్లపల్లి సైదులు, నకిరేకంటి సైదులు మాదిగ, పాంపాటి శ్రీనివాసులు, గడ్డం రమణయ్య, కూన్‌రెడ్డి కృష్ణారెడ్డి, చెరుపల్లి ముత్యాలు, నామిని సుధాకర్, వర్కాల మల్లారెడ్డి, చందునాయక్, ఒట్టికొట్టి శ్రీనివాస్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల రూరల్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మండలంలోని పెద్దకాపర్తిలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, ఏర్పుల నర్సింహ, పొట్లపల్లి రవి, మునుకుంట్ల బిక్షం, వెంకన్న, ఈదయ్య, బాలరాజు, మహేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చండూరు: చండూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు దోటి వెంకటేశ్‌యాదవ్ మాట్లాడారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు పేదరిక నిర్మూలన, కమ్యూనికేషన్, టెక్నాలజీ రంగాలకు గట్టి పునాదులు వేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్, డాక్టర్ కోడి శ్రీనివాసులు, కౌన్సిలర్లు మంచుకొండ కీర్తిసంజయ్, పన్నాల లింగయ్య, నల్లగంటి మల్లేష్, కలిమికొండ జనార్ధన్, గంజి వెంకటేశం, సంకోజు బ్రహ్మం, బొమ్మరబోయిన సైదులు, కారింగు రవి, వెంకన్న పాల్గొన్నారు.



మిర్యాలగూడలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

రుణమాఫీ పేరుతో ప్రభుత్వం మోసం : బీజేపీ



పెద్దవూరలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

నాగార్జునసాగర్, దేవరకొండ, ఆగస్టు 20: రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పెద్దవూర మండలకేంద్రంలో రైతు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీని షరతులు పెట్టి రైతులను నట్టేటా ముంచారన్నారు. రుణమాఫీ చేసే వరకు పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షనా పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బీజేపీ సాగర్ నియోజ కవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదిత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పద్మ, శంకర్‌నాయక్, మట్టారెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, జగన్‌నాయక్, సుమన్, వెంకట్‌రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేశారని బీజేపీ గిరిజనమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ విమర్శించారు. దేవరకొండలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట రైతులతో కలిసి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులందరికీ ఆగస్టు 15నాటికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అరకొరగా మాఫీ చేసి రైతులను మోసం చేశారన్నారు. సాంకేతిక కారణాల పేరుతో అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్, జిల్లా కార్యదర్శి చనమోని రాములు, వస్కుల సుధాకర్, మల్లేష్‌నాయక్, ఏటి కృష్ణ, గుండాల అంజయ్య యాదవ్, బిక్షపతి, జల్దా భాస్కర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తా అమిత్‌రెడ్డికి సన్మానం



అమిత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉరుమడ్ల గ్రామస్థులు

చిట్యాలరూరల్, ఆగస్టు 20: తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన గుత్తా అమిత్‌రెడ్డిని చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోనేటి యాదగిరి, పల్లపు బుద్ధుడు, పోలగోని స్వామి, జన్నపాల శ్రీను, పాకల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్: తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి నియామకంపై ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అమిత్‌రెడ్డిని నియమించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

డ్రగ్స్,గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ రాములునాయక్

నల్లగొండ క్రైం, ఆగస్టు 20: డ్రగ్స్ గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అడిషనల్ ఎస్పీ రాములునాయక్ కోరారు. డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలు సేవించే, విక్రయించే, రవాణా చేసే వారిపై ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన సుమారు 70మంది యువతకు వారి తల్లిదండ్రుల సమక్షంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ సబ్ డివిజన్‌లో విస్తృత తనిఖీలు, డ్రైవ్‌లు నిర్వహించి ఇప్పటికే రెండు దఫాలుగా కౌన్సిలింగ్ ఏర్పాటు చేశామన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వీటికి అలవాటు పడితే ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, అనేక ఇబ్బందులు తప్పవని సూచించారు. ఎవరైనా ఇలాంటి వాటికి అలవాటు పడితే వెంటనే తమ పరిధిలోని పీఎస్‌లో కానీ, జిల్లా డ్రగ్ కంట్రోల్ నంబర్ 871267026 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, డానియల్, ఆర్ఐ సంతోష్, ఎస్ఐలు సైదాబాబు, మానస తదితరులు ఉన్నారు.

చివరి భూముల వరకు సాగునీరందిస్తాం



దాచారం 65వ నెంబర్ కాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి

మాడ్గులపల్లి, ఆగస్టు 20: వరదకాల్వ పరిధిలో ఉన్న చివరి భూములకు నీరు అందిస్తామని ఇరిగేషన్ ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొద్దిరోజులుగా వరదకాల్వకు గండిపడడంతో వారం రోజులు ఆలస్యమైందన్నారు. మండల కేంద్రంలోని దాచారం-65వ నెంబర్ కాల్వను మంగళవారం పరిశీలించారు. చివరి ఆయకట్టు రైతులకు నీరందించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, సాగర్‌లో నీరు పుష్కలంగా ఉన్నాయన్నారు. మండలంలో ఆయకట్టు పరిధిలో ఉన్న చెరువులను నింపడంతోపాటు చివరి భూములకు నీరందిస్తామన్నారు. ఆయన వెంట డీఈ విఠలేశ్వర్, జేఈ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 20: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో, పట్టణ వార్డుల్లో సాగు, గృహ అవసరాలకోసం 24 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారను. గాలి, వానకు విరిగిన లేదా కూలిన స్తంభాల స్థానంలో కొత్తవి అమర్చాలని లోవోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి అదనంగా ట్రాన్స్‌ఫార్మలను ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. వర్షాకాలంలో స్తంభాలు, సపోర్టు తీగలకు ఎర్త్ వచ్చి ప్రజలకు, పశు వులకు ప్రమాదం సంభవించకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విద్యుత్ డీఈ సుధీర్‌కుమార్, ఏడీఈలు రవికుమార్, రవీందర్‌రెడ్డి, ఏఈ వెంకట్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీను, అబ్దుల్ అబీబ్, మల్జిత్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడు చాంద్‌పాష మృతి బాధాకరం



నాగార్జునసాగర్, ఆగస్టు 20: నాగార్జునసాగర్‌లోని ఫైలాన్‌కాలనీకి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు షేక్ చాంద్‌పాష మృతి బాధాకరమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు.చాంద్‌పాష మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్‌జీ, చంద్రమౌళి, అబ్దుల్ హలీం, లక్ష్మణ్‌నాయక్, రాము, చిన్ని, జిలానీ, అర్జున్, మత్రు, ముత్తయ్య, రియాజ్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి ఆర్థిక సాయం



మాడ్గులపల్లి, ఆగస్టు 20: మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన మండారి సైదులు(35) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన రూ.50వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగరాజు, జాన్‌రెడ్డి, పరమేష్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

చిట్యాల రూరల్: వెన్నుపూస సమస్యతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న చిన్నకాపర్తికి చెందిన లారీ డ్రైవర్ బొజ్జ శరత్‌కు శ్రీరామాంజనేయ లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లోడె సత్యనారాయణ, పాకాల ఉపేందర్, పాలకూరి రాకేశ్, మెట్టు అచ్చా లు, వలిగొండ సత్యనారాయణ, మెట్టు నాగశంకర్, నందిపాటి మహేశ్, పొంగూరి మల్లేశ్, ఈరమల్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో మండల స్థాయి పాఠశాలల క్రీడలు

డిండి, ఆగస్టు 20: మండలస్థాయి పాఠశాలల క్రీడలు ఈ నెల 30, 31వ తేదీల్లో మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంల మాట్లాడారు. మండల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న బాల, బాలికలు క్రీడల్లో పాల్గొనాలని కోరారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు 14 సంవత్సరాలు నిండి 17సంవత్సరాల వయస్సులోపు ఉండాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి యాదయ్య, పీఈటీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 20: మిర్యాలగూడ మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 26వ తేదీన ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు లేఖ రాసినట్లు మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని, కోతుల, కుక్కల బెడద అధికంగా ఉంద న్నారు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి అత్యవసర అంశాలను ఎజెండాలో చేర్చా లన్నారు. పట్టణంలోని ప్రధాన నాలాలో పూడికతీత పనుల నిర్వహణ కోసం జూలైలో జరిగిన సమావేశంలో పాలకవర్గం ఆమోదం తెలిపినా టెండర్లు పిలవలేదని ఆయన తెలిపారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామరచర్ల, ఆగస్టు 20: మండలంలోని 33కేవీ ఇంటర్‌లింక్ లైన్ వేస్తున్నందున 11కేవీ బొత్తలపాలెం ఫీడర్, వాచ్యాతండా ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వ్యాపార, వాణిజ్య, గృహ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం

చింతపల్లి, ఆగస్టు 20: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేస్తామని, నేడు కేవలం 50శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. సమావేశంలో బాదేపల్లి నిరంజన్‌గౌడ్, గడ్డం శేఖర్‌గౌడ్, లాలుగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



కొండమల్లేపల్లి, ఆగస్టు 20: కొండమల్లేపల్లి మండలంలో మంగళవారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, యువజన విభాగం మండల అధ్యక్షులు రమావత్ తులసీరాం మాట్లాడుతూ తీజ్ వేడుకలు గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, మహేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర ఇన్‌చార్జిగా ఎంపీవోగా సుధీర్‌కుమార్

నాగార్జునసాగర్, ఆగస్టు 20: పెద్దవూర మండల ఇన్‌చార్జి ఎంపీవోగా సుదీర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. త్రిపురారం మండలంతో పాటు ఆయనకు పెద్దవూర మండల అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఐలాపురంలో వైద్య శిబిరం

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 20: మండలంలోని ఐలాపురం గ్రామంలో జ్వరాలు, కీళ్లనొప్పులతో బాధపడుతున్న గ్రామస్థులకు వైద్యులు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ షేక్ మోయిద్ రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశార. గ్రామంలో విషజ్వరాలు తగ్గేంతవరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తెజావత్ ధర్మ, బానావత్ కాంతమ్మ, బానావత్ సైదా, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి, ఆగస్టు 20: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 21న నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని దేవరకొండ డివిజన్ మాల మహానాడు అధ్యక్షుడు యేకుల సురేస్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రిజర్వేషన్లు కల్పించే ముసుగులో బలహీనవర్గాలకు మంచి చేస్తున్నామన్న నెపంతో రాష్ట్రాలు రాష్ట్రపతి జాబితాను మార్చకూడదని, ఆర్టికల్ 341తో విభేదించకూడదని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ

నకిరేకల్, ఆగస్టు 20: సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో 101 తమలపాకులతో పూజ నిర్వహించారు. కార్యక్రమంలో దుప్పలపెల్లి వెంకన్న, పగిళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన

కొండమల్లేపల్లి, ఆగస్టు 20: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆధ్వర్యంలో మంగళవారం కొండమల్లేపల్లి చౌరస్తాలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి సయ్యద్‌గౌస్‌పాషా మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు చట్టాలను మరింత కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బండి నరేష్, పెద్దిశెట్టి సత్యనారాయణ, కలకొండ నరేందర్, అల్తాఫ్, ఆరిఫ్, మల్లేష్, గంజి యాదమ్మ, రాజేష్, బొజ్యానాయక్ శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

